క్లుప్తంగా

సామూహిక సీమంతం


గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరీ వనిత

విజయనగరం ఫోర్ట్: తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక సీమంతం సోమవారం నిర్వహించారు. స్థానిక జొన్నగుడ్డి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో గర్భిణులకు ఐసీడీఎస్ సూపర్ వైజర్ మేరీ వనిత సీమంతం చేశారు. వస్త్రాలు, పండ్లు, స్వీట్లు, పౌష్టికాహారం అందజేసి, ఆశీర్వచనాలు అందజేశారు. గర్భిణులంతా పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని, అలా చేస్తే రక్తహీనత బారినపడకుండా ఉండొచ్చని తెలిపారు. వైద్యుల సలహా మేర మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాజరాజేశ్వరి, లత, బుజ్జి, దుర్గాభవాని, నసీమా తదితరులు పాల్గొన్నారు.

మొయిద పీఏసీఎస్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న మొయిద సొసైటీ సీఈవో వలిరెడ్డి గిరి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద గ్రామ పీఏసీఎస్‌కు ఉత్తమ పీఏసీఎస్ అవార్డు లభించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ పురస్కారం దక్కింది. విజయవాడలో సోమవారం జరిగిన ఏపీసీవోబీ 62వ వార్షికోత్సవంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేతుల మీదుగా సొసైటీ సీఈవో వలిరెడ్డి గిరి ఈ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో ఏపీసీవోబీ చైర్మన్ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంపై కలెక్టర్‌కు ఫిర్యాదు


విజయనగరం ఫోర్ట్: మండల పరిధిలోని నరవ గ్రామ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు భర్తీపై సామాజిక కార్యకర్త నరవ సన్యాసిరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వెళ్లిన ఆయన.. కోర్టులో కేసు ఉంటుండగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా సుంకరి లక్ష్మీకాంతంను నియమించారని కలెక్టర్‌కు తెలిపారు. బినామీ మస్తర్లు వేస్తున్నారన్న ఆరోపణలు సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఉన్నాయని, అవేమీ పట్టించుకోకుండా నిబంధనలకు వ్యతిరేకంగా నియమించారన్నారు.

ఫోన్లు వద్దు ట్యాబ్‌లు ఇవ్వండి


ఫోన్లు అప్పగిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

భోగాపురం: అన్ని యాప్‌లను ఒకే యాప్ కిందికి తీసుకురావాలని లేదంటే పనిచేయలేమని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనిభారం తగ్గించాలని, ఎఫ్ఆర్ఎస్, ఇన్-అవుట్ విధానం రద్దు డిమాండ్ చేస్తూ స్థానిక ఐసీడీఎస్ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించి ఆందోళన చేశారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణకు ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లు సరిపోవడం లేదని, కొత్త యాప్‌లు ఇన్‌స్టాల్ చేస్తే ఫోన్ స్లో అయిపోయి ఇబ్బందిగా ఉంటోందన్నారు. తమకు 5జీ నెట్‌వర్క్‌తో కూడిన ట్యాబ్‌లు ఇవ్వాలని కోరారు. అనంతరం ప్రభుత్వం వారికి ఇచ్చిన స్మార్ట్‌ఫోన్లను అప్పగించారు. కార్యక్రమంలో కొర్లమ్మ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్


ధ్రువపత్రాలతో విద్యార్థులు, కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు కొనసాగిన 'ఎంప్లాయిబిలిటీ అండ్ సాఫ్ట్ స్కిల్స్' వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. ముగింపు సభలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు పాల్గొని, మాట్లాడారు. వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులు తమ వ్యక్తిగత వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, టీమ్ వర్క్ తదితర అంశాలపై అవగాహన పెంచుకున్నారని తెలిపారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ సాయిదేవమణి, నాంది ఫౌండేషన్ ప్రతినిధి గౌతంశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాలపై నిలదీయాలి

- బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీలో వైఎస్సార్ సీపీ నాయకులు


25వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

విజయనగరం: ఎన్నికల హామీలన్నీ అమలు చేయకుండా మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నగరంలోని 25, 33 డివిజన్లలో సోమవారం పర్యటించిన వారు ఇంటింటికీ వెళ్లి, చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. ఎన్నికలకు ముందు టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడి ప్రజలకు అనేకానేక హామీలిచ్చారని, అయితే వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కాలం దాటినా వారిచ్చిన చాలా రకాల హామీల్లో కనీస హామీలు అమలు చేయలేకపోయారన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలన్నీ అమలు చేసి, అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా సంక్షేమ పథకాలు అందివ్వడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలోని కూటమి సర్కారు మాత్రం పథకాలు ఇవ్వడంలో ఎంత జాప్యం చేస్తే అంత మంచిదన్నట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇప్పుడు వారు ఇచ్చిన రెండు, మూడు పథకాల్లోనూ అర్హులకు అన్యాయమే జరిగిందన్నారు.

మిగతా పథకాలెప్పుడిస్తారు?

ఏ పథకం ఎవరికి ఇస్తున్నారో ఎవరికి డబ్బులు వేస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. మహిళలకు ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్లు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా చేస్తున్న పోరాటాల వల్లే కూటమి పథకాలు అందిస్తోందని, లేకుంటే అవి కూడా రావన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలని, అంతవరకు వైఎస్సార్ సీపీ తరఫున పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జీవీ రంగారావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి బి.అప్పారావు, నాయకులు వై.రాజేష్, గణరాజు, కృష్ణంరాజు, బాలబ్రహ్మారెడ్డి, లక్ష్మణరావు, సూర్యనారాయణ, మురళి, రుక్మిణి, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


33వ డివిజన్‌లో ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు

సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ విభాగం మేనేజర్ ఆనందరావు

విజయనగరం ఫోర్ట్: స్థానిక రైతు శిక్షణ కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ చట్టం ప్రకారం పౌరుడు అడిగిన ఏ సమాచారం అయినా ఇవ్వాలని ప్రకృతి వ్యవసాయ విభాగం మేనేజర్ ఆనందరావు తెలిపారు. సమాచారం ఇవ్వడంలో అలసత్వం వహిస్తే జరిమానా కూడా విధిస్తారన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరు ఏం చేస్తున్నారు..ఏమేమి జరుగుతుందో తెలుసుకునే హక్కు ఈ చట్టం ద్వారా కల్పించబడిందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు ప్రకాష్, హేమసుందర్, ఏవో అడ్డూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్లు పంపిణీ


కిట్లు అందజేస్తున్న వైద్యాధికారిణి భాగ్యరేఖ

పూసపాటిరేగ: మండలంలోని రెల్లివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫైలేరియా(బోదకాలు) వ్యాధిగ్రస్తులకు అవసరమైన కిట్లు సోమవారం పంపిణీ చేశారు. క్యూలెక్స్ అనే దోమ వల్ల బోదకాలు వ్యాధి కలుగుతుందని, సకాలంలో చికిత్స పొందడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చని వైద్యాధికారిణి భాగ్యరేఖ తెలిపారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలని దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజ్‌కుమార్, ఈవో రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలి

భోగాపురం: విద్యార్థులంతా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలని ఆ దిశగా కృషి చేయాలని డాక్టర్ సీహెచ్ బిందు మాధురి కోరారు. మండలంలోని చెరుకుపల్లి అవంతిలో నిర్మాణ్ ఇండక్షన్ అనే అంశంపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఈ ఆధునిక ప్రపంచంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణిస్తున్న ఎంతోమందికి ఉన్నత ఉద్యోగాలు లభిస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలంటే మంచి నైపుణ్యం సంపాదించుకోవాలన్నారు.

సైబర్ మోసాల బారినపడొద్దు


మాట్లాడుతున్న కేంద్రియ గిరిజన యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ శ్రీనివాస్

విజయనగరం అర్బన్: సైబర్ మోసాల బారినపడకుండా అప్రమత్తంగా ఉండాలని కేంద్రియ గిరిజన యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాస్ సూచించారు. అదే యూనివర్సిటీలో సైబర్ నేరాలు-వాటి బారినపడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో వ్యక్తిగత, సంస్థాగత డేటాను సురక్షితంగా కాపాడుకోవడం ఎంతో కీలకంగా మారిందన్నారు. హ్యాకింగ్, డేటా లీకేజీ వంటి సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. క్లిష్టతరమైన పాస్‌వర్డ్‌లు ఉపయోగించడం, సురక్షిత బ్రౌజింగ్ వంటివి అభ్యసించడం అవసరమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 13న జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి బబిత

విజయనగరం లీగల్: జిల్లా కోర్టులో సెప్టెంబరు 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత తెలిపారు. జిల్లా కోర్టు సమావేశ మందిరంలో పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటి నుంచే లోక్ అదాలత్‌లో కేసుల రాజీకి కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ సౌమ్యలత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కామర్స్ డే


సెంచూరియన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

విజయనగరం అర్బన్: స్థానిక పట్టణంలోని మహారాజా అటానమస్ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ కామర్స్ డే సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సుకు సెంచూరియన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి ముఖ్య అతిథిగా హాజరై, కాసేపు మాట్లాడారు. మన నిత్యజీవితంలో కామర్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రతి వ్యక్తి జీవితంలో కామర్స్ ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్ తదితర రంగాల్లో ఈ-కామర్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర వాటిల్లో ఈ-కామర్స్ ప్రధాన పాత్ర వహిస్తోందన్నారు. అనంతరం ఆమెను కళాశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు, మాన్సాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ కేవీఎల్ రాజు, వాణిజ్య విభాగాధిపతి డాక్టర్ పడాల మధు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు


విద్యార్థులతో జేసీ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రంలోని జేసీ కార్యాలయంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులకు జేసీ ఎస్.సేతుమాధవన్ స్కాలర్‌షిప్‌లు, ప్రశంసా పత్రాలు సోమవారం అందజేశారు. క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ సంస్థ తరఫున ఇండియా ఫౌండేషన్ ద్వారా సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో విశేష ప్రతిభ కనబరిచిన బొబ్బిలి మండలంలోని గొల్లపల్లి, గజపతినగరం మండలంలోని లక్కిడం ప్రభుత్వ పాఠశాలలకు చెందిన నలుగురు విద్యార్థులకు రూ.10 వేల ప్రోత్సాహక నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణమూర్తి, క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు బి.వెంకటరమణ, జి.చక్రధరరావు, ఆర్.తిరుపతి, బి.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పలు ప్రాంతాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ డీఈఈ త్రినాధరావు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. విద్యుత్ మరమ్మతు పనుల నేపథ్యంలో సతివాడ సబ్‌స్టేషన్ పరిధిలోని పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, బొడ్డపేట, మధుపాడ, సతివాడ కల్లాలు, వల్లూరు, ఒమ్మి, మల్యాడ, వెంకన్నపాలెం గ్రామాలతో పాటు నెల్లిమర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని మొయిద, నారాయణపట్నం, పూతికపేట, కొండగుంపాం, గరికిపేటలకు, గుర్ల మండలంలోని చింతలపేట, పెదమజ్జిపేటలకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ అసౌకర్యం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన

విజయనగరం ఫోర్ట్: జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో కుష్టువ్యాధి నిర్మూలనపై సోమవారం అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన చికిత్సను డీఎంహెచ్‌వో ఎస్.జీవనరాణి తెలిపారు. చర్మంపై స్పర్శ, నొప్పిలేని మచ్చలు కనిపిస్తే వాటిని కుష్టువ్యాధి లక్షణాలుగా గుర్తించి, వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. వ్యాధిని త్వరగా గుర్తించి చికిత్స పొందితే అంగవైకల్యం బారినపడకుండా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా కుష్టువ్యాధి నియంత్రణ అధికారి కె.రాణి తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన

విజయనగరం క్రైమ్: నగరంలోని తోటపాలెం శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు ఐపీసీ కొత్త చట్టాలపై సోమవారం అవగాహన కల్పించారు. వన్‌టౌన్ సీఐ ఆర్‌వీకే చౌదరి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో కేసు సహా భారత న్యాయ సంవిధాన్‌లో కొత్తగా చేసిన చట్టాల గూర్చి వన్‌టౌన్ ఎస్ఐ దేవి తెలిపారు.

శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి

విజయనగరం క్రైమ్: మహిళలకు రక్షణగా ప్రభుత్వం తీసుకువచ్చిన శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని స్థానిక మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ గోవిందరావు సూచించారు. నగరంలోని మేరీ హైస్కూల్ విద్యార్థులకు శక్తి యాప్ ఇన్‌స్టాల్, దాని ప్రయోజనాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఎవరైనా ఆపదలో ఉన్నప్పుడు యాప్‌ను ఆశ్రయించి ఎస్‌వోఎస్ బటన్ నొక్కితే క్షణాల్లో పోలీస్ బృందాలు అక్కడకు చేరుకుని భద్రత కల్పిస్తాయన్నారు. ఇదే యాప్‌లో సేఫ్ ట్రావెలింగ్ ఆప్షన్ కూడా ఉందని, మనం ఆటోలు, బస్సుల్లో ప్రయాణించినప్పుడు ఈ ఆప్షన్‌ను ఆన్ చేసి ఉంచితే సురక్షితంగా మన గమ్యం చేరుకునేంత వరకు మన ప్రయాణంపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. అలాగే ఎక్కడైనా గంజాయి వినియోగించినట్లు గానీ రవాణా చేసినట్లు గానీ తెలిసినా 100 లేదా 112 లేదా 1972 నంబర్‌కు డయల్ చేయాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

గుర్రపుడెక్క తొలగించండి


జేసీ సేతుమాధవన్‌కు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు చిన్నప్పన్న

విజయనగరం అర్బన్: మత్స్యకారులకు జీవనోపాధిగా ఉన్న మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు రిజర్వాయర్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగించాలని జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు బర్రి చిన్నప్పన్న డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన పలువురు మత్స్యకారులతో కలిసి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వెళ్లి, జేసీ సేతుమాధవన్‌కు వినతిపత్రం అందజేశారు. అదే ప్రాజెక్టును ఆధారంగా చేసుకుని, 500 మంది మత్స్యకార కుటుంబాలు బతుకుతున్నాయని, గతంలో మాదిరి మెయిన్ గేటును తెరిస్తే గుర్రపుడెక్కంతా బయటకు పోతుందని తెలిపారు. గతంలో ఇదే గుర్రపుడెక్కలో చిక్కుకుని పలువురు ప్రాణాలు కూడా విడిచారని గుర్తు చేశారు.

● స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించండి



విద్యుత్ స్మార్ట్‌మీటర్లు వ్యతిరేకించాలని పిలుపునిస్తూ విజయనగరం నాలుగో వార్డు పరిధిలోని పూల్‌బాగ్‌లో సీపీఎం నాయకులు ధనరాజ్, శివ తదితరులు సోమవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇవే స్మార్ట్‌మీటర్లను చంద్రబాబు, లోకేష్‌లు వ్యతిరేకించారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత వారే వాటిని ఏర్పాటు చేయిస్తుండడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే విద్యుత్ సర్దుబాటు, ట్రూఅప్ చార్జీల పేరిట ప్రజలపై రూ.18,600 కోట్ల భారం వేసిన కూటమి సర్కారు..ఇప్పుడు మరోసారి స్మార్ట్‌మీటర్ల పేరిట రూ.1200 కోట్ల భారం మోపేందుకు తయారైందని మండిపడ్డారు. ఎవరైనా వస్తే స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయడానికి వస్తే వద్దని చెప్పాలని, లేకుంటే నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. అనంతరం ఇంటింటికీ స్మార్ట్‌మీటర్లు వ్యతిరేకించాలనే స్టిక్కర్లు అతికించారు.

-విజయనగరం గంటస్తంభం

● విద్యార్థి సంఘాలను అనుమతించకపోవడం దుర్మార్గం



పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ 30/60/2025ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ(భారత విద్యార్థి ఫెడరేషన్) నాయకులు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. విద్యావ్యవస్థలో విద్యార్థి సంఘాల ఏర్పాటు, జోక్యం వంటి హక్కులను రాజ్యాంగం కల్పించిందని, అటువంటి హక్కును మీ రెడ్‌బుక్ రాజ్యాంగంతో కాలరాస్తే ఎలా అని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.రాము, కార్యదర్శి సీహెచ్ వెంకటేష్‌లు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థుల సమస్యలపై పోరాటం చేసే సంఘాలను పాఠశాలల కార్యక్రమాల్లో పాల్గొనకుండా చేయాలని చూస్తుండడం దుర్మార్గమేనన్నారు. ఇప్పటికైనా ఇటువంటి ప్రజావ్యతిరేక విధానాలు మానుకోవాలని లేకుంటే పెద్దఎత్తున ఉద్యమానికి సన్నద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి.చిన్నబాబు, శిరీష, మురళి తదితరులు పాల్గొన్నారు.

-విజయనగరం గంటస్తంభం

● రైతుల ఆందోళన



విజయనగరం కలెక్టరేట్ ఎదుట డెంకాడ మండలం, గుణుపూరుపేట రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ 2041 ప్రకారం తమ గ్రామంలోని చెరువు కింద ఆయకట్టు రైతులమంతా భూములు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త మాస్టర్ ప్లాన్ వద్దని, పాత మాస్టర్ ప్లాన్ ముద్దు అని నినాదాలు చేశారు. కొత్త ప్లాన్ అమలైతే రైతులకు సెంటు భూమి కూడా మిగలదన్నారు. కచ్చితంగా పాత ప్లాన్ మాత్రమే అమలు చేయాలని లేదంటే రైతులకు ఆత్మహత్యే శరణ్యమని వాపోయారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు.

-విజయనగరం అర్బన్

● ఆటో కార్మికుల నిరసన



విజయనగరం కలెక్టరేట్ వద్ద ఆటో కార్మికులు సోమవారం నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామని చెబుతున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో తమ జీవనోపాధి పూర్తిగా దెబ్బతింటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఆర్టీసీలో గానీ ఇతర సంస్థల్లో గానీ ఉద్యోగాలు ఇప్పించాలని లేదంటే రూ.15 వేలకు తగ్గకుండా ఆర్థికసాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15వ తేదీ తర్వాత ఈ-చలాన్లు, పోలీస్ కేసులు లేకుండా చూడాలన్నారు. ప్రతి ఆటో డ్రైవర్‌కూ రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో శ్రీవిజయదుర్గా ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు అప్పలరాజురెడ్డి, నారాయణరావు, నాయకులు ధర్మారావు, సన్యాసిరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

-విజయనగరం టౌన్

దరఖాస్తుల ఆహ్వానం

శృంగవరపుకోట: మండలంలోని తాటిపూడి గురుకుల జూనియర్ కళాశాలలో జువాలజీ లెక్చరర్ పోస్టును తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శారదాభాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జువాలజీలో పోస్టు గ్యాడ్యుయేషన్ పూర్తి చేసి 50 శాతం మార్కులు సాధించిన మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల ఏడో తేదీలోగా కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు. పూర్తి వివరాలకు 87126 25071 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.